సాక్షి
కర్నూలు
శనివారం ı 26 ı ఆగస్టు ı 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సత్యసాయి జిల్లాకు చెందిన మల్లికార్జున రూ.1,01,116 విరాళంగా అందజేశారు.



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.38
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:81,096
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,636
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,211

న్యూస్‌రీల్

నకిలీ ఇంటెలిజెన్స్ ఏఎస్పీ అరెస్టు

కర్నూలు(అర్బన్): నగరంలోని రెండో పట్టణ పోలీసులు ఓ నకిలీ ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీని గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు... చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన మస్తాన్ బాషా అనే మోసగాడు నగరంలోని ఓ బ్యాంకు ఉద్యోగిని రెండో వివాహం చేసుకుని ఇక్కడే ఉంటున్నాడు. తన వెంట ఇద్దరు వ్యక్తులను ప్రైవేటు గన్‌మెన్లుగా నియమించుకుని, తాను ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీనని పలువురి దగ్గర పరిచయాలు పెంచుకుంటున్నాడు. ఈ నేపథ్యంలోనే పలువురు ఇతని కదలికలపై అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్థానిక ఎస్వీ కాంప్లెక్స్ సమీపంలో శుక్రవారం నకిలీ అడిషనల్ ఎస్పీ మస్తాన్ బాషాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

ముమ్మరంగా ఈ-క్రాప్ నమోదు

- ఇప్పటికే 1.47 లక్షల ఎకరాల్లో పంటల నమోదు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఈ-క్రాప్ బుకింగ్ ఊపందుకుంది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ చేయడంలో కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. గత ఏడాది ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ-కేవైసీ ప్రక్రియ చేపట్టారు. ఈ సారి పంటల నమోదుతో పాటే ఈ-కేవైసీ చే యించే ప్రక్రియ చేపట్టడం విశేషం. ఇప్పటి వరకు జిల్లాలో 7.56 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి జిల్లాలో 1,47,860.34 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ చేశారు. నంద్యాల జిల్లాలో 61,110.45 ఎకరాల్లో పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసినట్లు స్పష్టమవుతోంది. నంద్యాల జిల్లా పంటల నమోదులో 19వ స్థానంలో ఉండటం గమనార్హం. సాంకేతిక సమస్యలకు పరిష్కారం లభించడంతో ఈ-క్రాప్ నమోదు ఊపందుకుంది.

నిఘా నీడ.. సాంకేతిక తోవ

- ఎస్‌ఐ దేహదారుఢ్య పరీక్షల్లో సాంకేతికత జోడింపు
- తొలిరోజు అర్హత సాధించిన 431 మంది

కర్నూలు: పోలీసు శాఖలో ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల్లో పారదర్శకతకు పెద్దపీట వేశారు. ఎలాంటి తప్పిదాలు, అక్రమాలకు ఆస్కారం లేకుండా సాంకేతికతను జోడించారు. ప్రతి విభాగంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పకడ్బందీగా నిఘా ఉంచడంతో అభ్యర్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా రెండో ఘట్టం దేహదారుఢ్య పరీక్షలు కర్నూలులో శుక్రవారం మొదలయ్యాయి. ఏపీఎస్పీ పటాలం మైదానంలో జరిగిన దేహదారుఢ్య పరీక్షలను డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ జెండా ఊపి ప్రారంభించారు. మొదటిరోజు 600 మందిలో 431 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 44 మంది సర్టిఫికెట్లు తీసుకురాకపోవడంతో వెనక్కు పంపారు. మిగిలిన వీరిలో 1600 మీటర్ల పరుగులో 295 మంది, 100 మీటర్ల పరుగులో 208 మంది, లాంగ్ జంప్‌లో 255 మంది ప్రతిభను చాటి ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 198 మంది తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేదాకా మైదానంలోనే ఉండి పోలీసు అధికారులకు తగు సూచనలు చేశారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు, డీఎస్పీలు యుగంధర్ బాబు, రంగముని, డీపీఓ ఏఓ సురేష్ బాబు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

తెల్లవారుజామున 4.30 గంటలకే రాక

అభ్యర్థులు తెల్లవారుజామున 4.30 గంటలకే మైదానానికి చేరుకున్నారు. ప్రధాన గేటుకు సమీపంలోని పోలీస్ కళ్యాణ మండపానికి ఎదురుగా ఉన్న మైదానంలో ఏర్పాటు చేసిన టెంటు వద్ద అభ్యర్థులకు పోలీసు సిబ్బంది టోకన్ అందించి బస్సులో ఈవెంట్స్ నిర్వహించే మైదానానికి తీసుకెళ్లి లోపలికి అనుమతించారు.

బయోమెట్రిక్ పద్ధతిలో హాజరు

- అభ్యర్థులు ఏపీఎస్పీ పటాలానికి చేరుకోగానే అడ్మిట్ కార్డు, ఇంటిమేషన్ లెటర్ పరిశీలించి హాజరును బయోమెట్రిక్ పద్ధతిలో తీసుకున్నారు.
- ఆ తర్వాత వేలిముద్రలు, ఫొటోలు తీసుకుని టోకెన్ నంబర్‌ను ఆన్‌లైన్ ద్వారా కేటాయించారు.
- బ్యాచ్‌కు 50 మంది చొప్పున డాక్యుమెంట్లను పరిశీలించి కౌంటర్ వద్దకు పంపించారు.
- అభ్యర్థుల రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత బయోమెట్రిక్ తీసుకుని ఛాతీ, ఎత్తు కొలతలను పరిశీలించి ఛాతీ నెంబర్‌పై క్యూఆర్ కోడ్‌తో కూడిన బ్యాడ్జ్ తగిలించారు.
- అనంతరం పక్కనే ఉన్న మైదానంలోకి తీసుకెళ్లి 1,600 మీటర్ల పరుగుపందేనికి సిద్ధం చేశారు.
- బ్యాచుల వారీగా పోటీలో పాల్గొన్న ప్రతి అభ్యర్థికీ ఎలక్ట్రానిక్ సెన్సార్ చిప్‌ను కాళ్లకు అమర్చారు.
- అభ్యర్థులు ఎన్ని నిమిషాల్లో గమ్యస్థానానికి చేరారో చిప్ ద్వారా కంప్యూటర్‌లో నిక్షిప్తమైంది.

అందుబాటులో వైద్యబృందం

పరుగు తీస్తున్నప్పుడు, లాంగ్ జంప్ సమయంలో అస్వస్థతకు లేదా ఆరోగ్యపరంగా ఇబ్బంది పడిన అభ్యర్థులకు పోలీసు ఆసుపత్రి డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో వైద్య బృందం ప్రథమ చికిత్సలు అందించారు. అత్యవసర వైద్యానికి ఆసుపత్రికి తరలించడానికి 108 అంబులెన్స్ వాహనాన్ని కూడా అందుబాటులో ఉంచారు.



ఓ అభ్యర్థి లాంగ్‌జంప్



దేహదారుఢ్య పరీక్ష పోటీలను ప్రారంభిస్తున్న డీఐజీ సెంథిల్‌కుమార్, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్

> **అవకతవకలకు ఆస్కారం లేదు**
>
> రాయలసీమ రేంజ్ పరిధిలో 16,108 మంది అభ్యర్థులు పీఈటీ, పీఎంటీ టెస్టుల్లో పాల్గొంటున్నారు. ఇందులో 14,011 మంది పురుషులు, 2,097 మంది మహిళలు ఉన్నారు. రోజుకు 800 మంది అభ్యర్థులు చొప్పున సెప్టెంబర్ 20వ తేదీ వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాలని రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదేశించింది. ఎక్కడ కూడా ఎలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావు లేకుండా ఆధునిక ఆర్‌ఎఫ్‌ఐడీ కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం.
>
> – డీఐజీ సెంథిల్ కుమార్

కలల కొలువు కోసం.. దేహదారుఢ్య పరీక్షల చిత్రాలు 8లో

వరలక్ష్మీ నమోస్తుతే..!

- వైభవంగా సామూహిక వ్రతాలు
- పాల్గొన్న వెయ్యి మంది ముత్తైదువలు



రావమ్మా..వరలక్ష్మీ కలశానికి పూజలు చేస్తున్న యువతి



వ్రతంలో పాల్గొన్న ఈఓ లవన్న దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా శ్రీశైల దేవస్థానం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించింది. ఆలయ ఉత్తర ద్వారం ఎదురుగా ఉన్న చంద్రవతి కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా స్వామిఅమ్మవార్లకు షోడశోపచార పూజలు చేపట్టారు. వ్రతంలో పాల్గొనే ముత్తైదువుల కోసం వేర్వేరుగా కలశాలను నెలకొల్పి శాస్త్రోక్తంగా వ్రతం జరిపించారు. వ్రతంలో భాగంగా భక్తులందరీ చేత విడివిడిగా కలశస్థాపన చేయించి వరలక్ష్మీదేవిని సమంత్రకంగా ఆవహింప జేశారు. శ్రీసూక్తవిధానంలో వ్రతకల్పపూర్వకంగా వరలక్ష్మీదేవిని షోడశోపచారపూజలు జరిపించారు. అనంతరం అర్చకులు వ్రతకథను పఠించి వ్రతమహిమా విశేషాలను భక్తులకు తెలియజేశారు. నీరాజన మంత్రపుష్పాలను జరిపి వ్రతసమాప్తి చేశారు. కార్యక్రమంలో సతీసమేతంగా పాల్గొన్న దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న మాట్లాడుతూ వైదిక సంప్రదాయంలో శ్రావణమాసాన వరలక్ష్మీవ్రతం ఆచరించడం సంప్రదాయంగా వస్తుందన్నారు. వ్రతాన్ని జరిపించుకున్న ముత్తైదువులందరికీ అమ్మవారి శేషవస్త్రంగా రవిక, పూలు, గాజులు, శ్రీశైలప్రభ మాసపత్రిక, ప్రసాదాలు, కైలాసకంకణాలు అందజేశారు. అలాగే ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామిఅమ్మవార్ల దర్శనం కల్పించారు. వ్రతాలకు కావాల్సిన పూజాద్రవ్యాలన్నింటినీ దేవస్థానమే సమకూర్చింది.



సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు

జిల్లా అభివృద్ధికి కేఈ, కోట్ల చేసిందేమీ లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య

- దొంగ ఓట్లు, వెన్నుపోటు చరిత్ర చంద్రబాబుదే
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): జిల్లా అభివృద్ధికి టీడీపీ నేతలు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కేఈ కృష్ణమూర్తి చేసిందేమీ లేదని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య విమర్శించారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గతంలో కేంద్ర మంత్రిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా కేఈ కృష్ణమూర్తి పనిచేశారని, వీరు జిల్లా అభివృద్ధికి ఏమీ చేయలేదన్నారు. పత్తికొండ ప్రాంతంలో 60 చెరువులు ఉండగా.. ఒక్క చెరువుకూ హంద్రీ-నీవా నీరు ఇవ్వలేదని గుర్తు చేశారు. 2019 ఎన్నికల నెల రోజుల ముందు గుండ్రేవులతో పాటు ఇతర ప్రాజెక్టులకు చంద్రబాబు జీవోలు ఇచ్చారని, కేవలం ఎన్నికల్లో లబ్ధి కోసం తప్ప చిత్తశుద్ధితో కాదన్నారు. చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన కారణంగా వర్షాలు సక్రమంగా పడడం లేదని, ప్రాజెక్టుల్లో నీటి మట్టం తగ్గుముఖం పట్టిందన్నారు. దొంగ ఓట్లు, వెన్నుపోట్లు, అడ్డదారులతో అధికారంలోకి వచ్చిన చరిత్ర చంద్రబాబుదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓట మి తప్పదనే విషయం సర్వేల ద్వారా తెలియడంతో రాష్ట్రంలో అశాంతి, అల్లర్లు, హింస సృష్టించాలని కుట్రలు పన్నుతున్నారన్నారు. ఇందులో భాగంగానే చంద్రబాబుతో పాటు లోకేష్, పవన్ కల్యాణ్ సభల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడం ఓ అద్భుతమని రామయ్య కొనియాడారు. ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, సత్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు ఆర్‌బీకే భవనాలు పూర్తి కావాలి

- నాడు – నేడు పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం
- ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి
- సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(అర్బన్): రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణాలను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.జీ సృజన ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, హౌసింగ్, మన బడి నాడు- నేడు తదితర అంశాలకు సంబంధించి జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బీఎల్(బేస్‌మెంట్ లెవల్) స్థాయికి పైన ఉన్న 183 రైతు భరోసా కేంద్రాలు, 179 విలేజ్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 15వ తేదీ నాటికి 240 గ్రామ సచివాలయ భవన నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. నాడు - నేడు పనుల్లో చాలా తక్కువ శాతం పురోగతి సాధించారని అసహనం వ్యక్తం చేశారు. హొళగుంద మండలంలో 81 శాతం మాత్రమే పురోగతి సాధించారన్నారు. 312 పాఠశాలల్లో 1,312 అదనపు తరగతి గదుల నిర్మాణాలను సెప్టెంబర్ 30వ తేదీలోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో పనులను నెలాఖరుకు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ, సమగ్ర శిక్ష అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బడిఈడు పిల్లలనందరినీ పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి ఆప్షన్ -3 కింద ఇళ్ల నిర్మాణాల పురోగతి తక్కువగా ఉందని, సంబంధిత కాంట్రాక్టర్లతో సమావేశాలు నిర్వహించి పురోగతి సాధించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్లు తమకు కేటాయించిన మండలాలకు వెళ్లి కాంట్రాక్టర్లతో సమావేశాలు నిర్వహించి పురోగతి సాధించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 30న కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారన్నారు. అదే రోజున ఓర్వకల్లులో ఉన్న లేఅవుట్‌ను ప్రారంభించుకుంటున్నామన్నారు. ఆ లేఅవుట్‌లో రోడ్లు, వీధిదీపాలు, ఎంట్రన్స్ ఆర్చీ తదితర పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కౌతాళం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, పత్తికొండ, ఓర్వకల్లు, వెల్దుర్తి, కోసిగి, కృష్ణగిరి, దేవనకొండ మండలాల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో చెత్త సంపద కేంద్రాలకు సంబంధించిన పనులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ కే సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బీ నాగేశ్వరరావు, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, డీఈఓ రంగారెడ్డి, ఎస్‌ఎస్‌ఏ పీఓ వేణుగోపాల్, హౌసింగ్ ప్రత్యేకాధికారి మల్లికార్జునుడు, ఇంచార్జీ పీడీ సిద్ధలింగమూర్తి, ఐసీడీఎస్ ఇంచార్జ్ పీడీ వెంకలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యులుగా వై.సీతారామిరెడ్డి



మంత్రాలయం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పెద్దన్న వై.సీతారామిరెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా ఎంపికయ్యారు. శుక్రవారం పాలక మండలి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో సభ్యులను ప్రకటించారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి.. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఇప్పటికే చట్టసభల్లో ఉన్నారు. తాజాగా వీరి సోదరుడు వై.సీతారామిరెడ్డిని టీటీడీ బోర్డు సభ్యులుగా నియమించడం పట్ల నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల సంబరాలు మిన్నంటాయి. గతంలో మంత్రాలయం ఎంపీపీ, జెడ్పీటీసీ, సింగిల్ విండో అధ్యక్షులుగా, ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా సీతారామిరెడ్డి సేవలందించారు.

ఏడుగురు ఉపాధి సిబ్బంది సస్పెన్షన్

- కోడుమూరు ఉపాధి పనుల్లో భారీగా అక్రమాలు
- ఏపీవో, ఈసీలకు షోకాజ్ నోటీసులు జారీ

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఏడుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లు, నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం కోడుమూరు మండలంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలకు సంబంధించి ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఇందులో గోరంట్ల, అమడగుంట్ల, ఎర్రదొడ్డి, వెంకటగిరి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో భారీగా నిధుల దుర్వినియోగం వెలుగు చూసింది. తీవ్రంగా పరిగణించిన జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి గోరంట్ల, అమడగుంట్ల గ్రామాలకు చెందిన టెక్నికల్ అసిస్టెంటు(టీఏ) కె.రవికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎస్.రాజు, శ్రీనివాసులు, ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన టీఏ జి.పురుషోత్తం కుమార్, ఫీల్డ్ అసిస్టెంటు జనార్దన్, వెంకటగిరి గ్రామానికి చెందిన టీఏ బివిజి వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంటు రెడ్డమ్మలను సస్పెండ్ చేశారు. కోడుమూరు ఏపీఓ రమాదేవి, ఈసీ వెంకటేశ్వర్లుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

నేడు కర్నూలులో వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్ ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్ కార్యాలయం

కర్నూలు(లీగల్): రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్‌ను కర్నూలులో శనివారం సాయంత్రం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కర్నూలు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ ప్రారంభించనున్నారు. ఎన్‌ఆర్ పేటలోని నూతన భవనంలో కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా వాసి కె.శ్రీనివాసరెడ్డి కూడా హాజరుకానున్నారు. ఈ ట్రిబ్యునల్ ఏర్పాటుతో వక్ఫ్ బోర్డు చట్టం కింద దాఖలయ్యే అన్ని కేసులను కర్నూలులో విచారించి, పరిష్కారం చేస్తారు. హైదరాబాద్‌లో ఉన్న వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్‌ను కర్నూలులో ఏర్పాటు చేస్తూ గతంలో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ట్రిబ్యునల్‌కు 7వ అదనపు జిల్లా జడ్జి జి.భూపాల్ రెడ్డిని నియమించారు. ట్రిబ్యునల్ కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులతో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావుతో పాటు ఇతర న్యాయాధికారులు పాల్గొననున్నారు.

సీఎస్‌ఈకి జైకొట్టిన విద్యార్థులు

- జిల్లాలోని 12 ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్ల కేటాయింపు
- 6 వేల సీట్లకుగాను మొదటి విడతలో 4,643 భర్తీ
- సీఎస్‌ఈ, ఈసీఈ, సీఎస్‌డీ బ్రాంచ్‌లకు డిమాండ్
- సివిల్, మెకానికల్ బ్రాంచ్‌లపై తగ్గుతున్న ఆసక్తి

కర్నూలు సిటీ: ఇంజినీరింగ్ విద్యను అభ్యసించేందుకు కాలేజీలను ఎంపిక చేసుకున్న విద్యార్థులకు గురువారం సీట్లు కేటాయించారు. జిల్లాలోని 12 ఇంజినీరింగ్ కాలేజీల్లో మొదటి విడత 77.4 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. అత్యధిక శాతం మంది విద్యార్థులు సీఎస్‌ఈ(కంప్యూటర్‌సైన్స్ ఇంజినీరింగ్) కోర్సు చదివేందుకు ఆసక్తి చూపారు. సివిల్, మెకానికల్ బ్రాంచ్‌ల్లో చేరికలు తక్కువగా ఉన్నాయి. ఇంజినీరింగ్ విద్యలో కొత్త కోర్సులకు రాష్ట్రప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో సీఎస్‌ఎం, సీఎస్‌డీ, సీఏఐ కోర్సులను కాలేజీలు ప్రవేశపెట్టాయి. కంప్యూటర్ ఆధారిత కోర్సులు పూర్తి చేసిన వారికి ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. దీంతో ఎక్కువ మంది విద్యార్థులు సీఎస్‌ఈ కోర్సులో చేరేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లాలో రాయలసీమ యూనవర్సిటీతో పాటు 12 ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్, మెకానికల్ బ్రాంచ్‌లు మినహా ఈసీఈ, సీఎస్‌ఈ బ్రాంచ్‌లలో 80 శాతం, ఈ విద్యా సంవత్సరంలో కొత్త ప్రవేశపెట్టిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ బ్రాంచ్‌లో 50.5 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. జి.పుల్లారెడ్డి, జి.పుల్లయ్య, రవీంద్ర కాలేజీల్లో 100 శాతం సీఎస్‌ఈ సీట్లు భర్తీ అయ్యాయి. రాజీవ్ గాంధీ మెమోరియల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, డా. కేవీ సుబ్బారెడ్డి, ఆశోకా ఉమెన్ కాలేజీల్లో అత్యధిక సీట్లు భర్తీ అయ్యాయి. ఇక మిగిలిన కాలేజీల్లో ఒకటి రెండు బ్రాంచ్‌లు మినహా మిగిలిన వాటిలో పెద్దగా సీట్లు భర్తీ కాలేదు.

31లోపు రిపోర్ట్ చేయాలి

జిల్లాలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో 6వేల సీట్లు ఉండగా.. మొదటి విడతలోనే 4,643 భర్తీ అయ్యాయి. సివిల్ బ్రాంచ్‌లో జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్‌లో మాత్రమే అత్యధికంగాను, ఆ తరువాత ఆశోకా, జి.పుల్లయ్య, ఆర్‌జీఎం కాలేజీల్లో కొంత మేరకు భర్తీ అయ్యాయి. సివిల్ ఇంజినీరింగ్‌లో ఐదు కాలేజీల్లో సింగిల్ డిజిట్ సీట్లు, ఓ కాలేజీలో అయితే ఒక్క సీటు కూడా భర్తీ కాలేదు. మెకానికల్ బ్రాంచ్‌లో సైతం జి.పుల్లారెడ్డి, జి.పుల్లయ్య, ఆర్జీఎం కాలేజీల్లో మాత్రమే కొంత మేరకు సీట్లు భర్తీకాగా, నాలుగు కాలేజీల్లో సింగిల్ డిజిట్, రెండు కాలేజీల్లో ఒక్క సీటు కూడా భర్తీ కాకపోవడం గమనార్హం. ఈఈఈ బ్రాంచ్‌లో సైతం 50 శాతం లోపే సీట్లు భర్తీ అయ్యాయి. ఈ బ్రాంచ్‌లలో జి.పుల్లారెడ్డి, జి.పుల్లయ్య, రాజీవ్ గాంధీ ఇంజనీరింగ్ కాలేజీల్లో మాత్రమే చదివేందుకు విద్యార్థులు ఆసక్తి చూపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు కాలేజీకి వెళ్లి రిపోర్ట్ చేసుకోవాలి. అదే రోజు నుంచి మొదటి ఏడాది తరగతులు ప్రారంభం కానున్నాయి.

క్లుప్తంగా

సెలవులో వెళ్లిన సర్వే ఏడీ, ఐసీడీఎస్ పీడీ

కర్నూలు(సెంట్రల్): భూరికార్డుల సర్వే ఏడీ జి.శ్రీరామ మోహన్, ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి అనారోగ్య కారణాలతో సెలవులో ఉన్నారు. ఈ క్రమంలో వీరి స్థానంలో సర్వే ఏడీగా అదే శాఖలో పనిచేస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేగా పని చేస్తున్న విజయసారధి, ఐసీడీఎస్ పీడీగా బీసీ సంక్షేమ సాధికారత అధికారి వెంకటలక్ష్మమ్మలకు పూర్తి అదనపు బాధ్యతలతో అప్పగించే ఫైలుపై కలెక్టర్ సంతకాలు చేయాల్సి ఉంది. ఆమె సంతకాలు చేసిన వెంటనే వారు బాధ్యతలు స్వీకరిస్తారు.

'పీహెచ్‌యూ' టెండర్లకు స్పందన కరువు

కర్నూలు (న్యూసిటీ): జిల్లాలోని ఐదు పీహెచ్‌యూ (పబ్లిక్ హెల్త్ యూనిట్లు) భవన నిర్మాణాల కోసం రూ.1.68 కోట్లతో ఆర్‌అండ్‌బీ శాఖ పిలిచిన టెండర్లకు స్పందన కరువైంది. మూడుసార్లు టెండర్లను పిలిచినా కృష్ణగిరి, సి.బెళగల్ పీహెచ్‌యూ భవన నిర్మాణాలకు మాత్రమే ఒక్కొక్క దానికి షెడ్యూల్ దాఖలు చేశారు. ఆస్పరి, పెద్దకడుబూరు, గోనెగండ్ల పీహెచ్‌యూలకు షెడ్యూల్ దాఖలు చేయలేదు. సింగిల్ టెండర్లను అధికారులు ఆమోదిస్తారో లేదో చూడాలి. మిగతా మూడు పీహెచ్‌యూలకు త్వరలో టెండర్లు పిలుస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

మాతృమరణాలు జరిగితే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఎక్కడైనా మాతృమరణాలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య హెచ్చరించారు. పెద్దహరివాణం, కోసిగి, పోలకల్, దేవనకొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో జూన్, జులై నెలల్లో జరిగిన మాతృ మరణాలపై శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. మాతృమరణాలకు కారణాలను వైద్యులు, సిబ్బందితో చర్చించారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు అన్ని వైద్యపరీక్షలతో పాటు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. హైరిస్క్ గర్భవతులను గుర్తించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందించాలన్నారు. సమావేశంలో గైనకాలజిస్టు డాక్టర్ రత్నకుమారి, డీఐఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ వెంకటనారాయణ, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ రేవతి, డాక్టర్ దర్శన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజయమే లక్ష్యం: సిన్థటిక్ ట్రాక్‌పై అడుగు వేసి పరుగు అందుకుంటున్న ఎస్ఐ అభ్యర్థులు



సొమ్మసిల్లి.. పరుగు పందెంలో పడిపోయిన అభ్యర్థి, పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు



దేహదారుఢ్య పరీక్షల కోసం ఏపీఎస్పీ పటాలానికి వచ్చిన ఎస్ఐ అభ్యర్థులు



యంత్రంతో ఛాతీని కొలుస్తూ..



ఎత్తును పరిశీలిస్తూ..



పరుగు పందెం కోసం కాళ్లకు ఎలక్ట్రానిక్ చిప్‌ను తగిలిస్తూ..

కలల కొలువు కోసం..



ఎస్ఐ కావాలనేది వారి కల.. ఇందుకోసం కఠినంగా శ్రమించారు. రోజుల తరబడి మైదానాల్లో పరుగులు పెట్టారు..లాంగ్ జంప్, హై జంప్ సాధన చేశారు. ఊపిరి బిగబట్టి ఛాతీని వెడల్పు చేసుకున్నారు. గుండె నిండా ధైర్యంతో శుక్రవారం కర్నూలులోని ఏపీఎస్పీ పటాలం మైదానం చేరుకున్నారు. వీరికి ఇక్కడ అధికారులు వివిధ రకాల పరీక్షలు పెట్టారు. అవకతవకలకు తావివ్వకుండా సాంకేతిక యంత్రాల సాయం తీసుకున్నారు. బయోమెట్రిక్ హాజరుతో పారదర్శకంగా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



అభ్యర్థి ఫొటో తీస్తూ..



సర్టిఫికెట్ల పరిశీలన



గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్



అభ్యర్థులతో సంతకాలు తీసుకుంటూ..



అర్హత సాధించిన వారి వివరాలు నమోదు చేస్తూ..

పాడి రైతుల అభివృద్ధే విజయ డెయిరీ లక్ష్యం

- డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ రాజేష్



రైతులకు బోనస్ నగదును అందజేస్తున్న విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ రాజేష్, ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి: పాడి రైతుల ఆర్థికాభివృద్ధే విజయ డెయిరీ లక్ష్యమని డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం తోడేండ్లపల్లె గ్రామంలో విజయ డెయిరీ ఆధ్వర్యంలో 25 మంది పాడి రైతులకు మూడు నెలలకు సంబంధించిన బోనస్ రూ.50 వేలు, పశుగ్రాసం సాగుకు సహాయం రూ.50 వేలు, ముత్యాలపాడు గ్రామానికి చెందిన ఎనిమిది మంది పాడి రైతులకు గేదెల కొనుగోలు సబ్సిడీ రూ.1.20 లక్షల చెక్కును అందజేశారు. సమావేశంలో డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ రాజేష్ మాట్లాడుతూ డెయిరీ చైర్మన్‌గా ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత లీటర్‌కు రూ. 3 చొప్పున పాడి రైతులకు రూ. 14 కోట్ల మేర బోనస్‌ను అందజేశామన్నారు. అలాగే పశుగ్రాసాన్ని సాగు చేసే రైతులకు ఎకరాకు రూ. 5 వేల చొప్పున ఇప్పటి వరకు 14 జిల్లాల పరిధిలో రూ.30 లక్షల మేర సహాయం చేశామన్నారు. విజయ పాల డెయిరీ సీజన్‌లో రోజూ రెండు లక్షల లీటర్ల పాల సేకరణ చేస్తుందన్నారు. పాడి రైతుల సంక్షేమం కోసం క్షీరబంధు, కల్యాణమస్తు పథకాలతో అండగా నిలుస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, మేనేజరు పద్మయ్య, ఏజెంట్ దస్తగిరి, సర్పంచ్ గోవిందు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటగిరి రాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర



మాట్లాడుతున్న డీపీఎం చంద్రశేఖర్

కర్నూలు(అగ్రికల్చర్): పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయ పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తోందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ వెనుకనున్న ఉద్యాన భవన్‌లో కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని రైతు శాస్త్రవేత్తలు, మెంటర్స్‌కు రీజినల్ స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత భూముల్లో ప్రయోగాత్మకంగా సాగు చేస్తూ ఇతర రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి థిమాటిక్ లీడ్స్ సుధాకర్, సురేష్, కన్సల్టెంటు లక్ష్మయ్య, థిమాటిక్ పాయింట్ పర్సన్స్ నీరజ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయానికి ప్రత్యేక రైలు

- మచిలీపట్నం నుంచి నెల రోజుల పాటు తిప్పేందుకు గ్రీన్ సిగ్నల్



కర్నూలు(రాజ్‌విహార్): మచిలీపట్నం నుంచి కర్నూలు మీదుగా మంత్రాలయం రోడ్డు స్టేషన్ వరకు ప్రత్యేక రైలును నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కర్నూలు నుంచి గుంటూరు, విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకు నడిచిన ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును జూలై 1వ తేదీ నుంచి నుంచి నిలిపివేశారు. దీంతో విజయవాడ, అమరావతికి వెళ్లే ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుగులోకి తెస్తూ 'రాజధానికి రైలేదీ?' అనే శీర్షికన ఈ నెల 9వ తేదీన 'సాక్షి' దినపత్రికలో వార్తా కథనం ప్రచురితం అయిన విషయం తెలిసిందే. దీనిపై కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ స్పందించి రైల్వే ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. కర్నూలు నుంచి మచిలీపట్నం వరకు రోజువారిగా నడపాలని ఆయన రైల్వే బోర్డు చైర్మన్, సీఈఓ అనిల్‌కుమార్ లాహోటిని ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈ రైలును ప్రత్యేక/తత్కాల్ పేరుతో కాకుండా రోజువారి రెగ్యులర్‌గా నడపాలని కోరారు. దీనిపై స్పందించిన రైల్వే బోర్డు చైర్మన్ దీనిని పూర్తి స్థాయిలో పరిశీలించి రైలు నడిపేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎట్టకేలకు ఈ రైలును తిరిగి నడిపేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే, కర్నూలు వరకే ఉన్న ఈ రైలును గద్వాల, రాయచూరు మీదుగా మంత్రాలయం రోడ్డు స్టేషన్ వరకు పొడిగించారు. ఈ నెల 31 నుంచి సెప్టెంబరు 30 వరకు ప్రతి శని, మంగళ, గురువారాల్లో ఈరైలు తిరగనుంది. మచిలీపట్నం (నంబర్ 07067) నుంచి రాత్రి 8గంటలకు బయలుదేరి విజయవాడకు రాత్రి 9:45, గుంటూరుకు 10:40 గంటలకు చేరుకుంటుంది. మరుసటి రోజు తెల్లవారు జామున 3:20 గంటలకు నంద్యాలకు, ఉదయం 5:45 గంటలకు డోన్‌కు, 7:20కి కర్నూలుకు, 11గంటలకు మంత్రాలయ రోడ్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మంత్రాలయం రోడ్డు స్టేషన్ నుంచి (నంబర్ 07068) సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 1 వరకు ప్రతి ఆది, బుధ, శుక్రవారాల్లో మధ్యాహ్నం 3:30 గంటలకు బయలుదేరుతుంది. కర్నూలుకు సాయంత్రం 6:35కి, డోన్‌కు రాత్రి 8:10, నంద్యాలకు 10:30, గుంటూరుకు 3:35, విజయవాడకు 4:50, మచిలీపట్నానికి 7:05గంటలకు చేరుకుంటుంది. ఈ రైలును సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దాసుపత్రిలో పూర్తిస్థాయి 'ఈ–హాస్పిటల్'



ఈ–హాస్పిటల్ అమలును తెలుసుకుంటున్న డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పూర్తిస్థాయిలో ఈ–హాస్పిటల్ అమలు చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిలోని పలు ఓపీ విభాగాలలో ఈ–హాస్పిటల్ అమలుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమికంగా ఆసుపత్రిలోని జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, సైకియాట్రి, ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, ఈఎన్‌టీ తదితర విభాగాల్లో ఈ–హాస్పిటల్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విభాగాల్లో ఓపీతో పాటు ఔట్ పేషంట్ సేవలకు సంబంధించిన క్లినికల్ మాడ్యూల్ ఎంట్రీ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. రానున్న రోజుల్లో పేపర్‌లెస్ ట్రీట్‌మెంట్ అమలవుతుందన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సమాచారాన్ని ఈ–హాస్పిటల్‌లో నమోదు చేయాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలోని పలు ఓపీ విభాగాల్లో వైద్యులు హాజరును పరిశీలించారు. ఆయన వెంట ఈ–హాస్పిటల్ నోడల్ అధికారి డాక్టర్ శివబాల నాగాంజన్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

అప్‌డేట్ కాని చలానాలతో రిజిస్ట్రేషన్లకు ఆటంకం

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని బ్యాంకులు

కర్నూలు(సెంట్రల్): ఆస్తుల క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లలో చలనాలు చాలా కీలకం. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో చలానా నంబర్ వేస్తేను ప్రక్రియ ముందుకు సాగుతుంది. అయితే కొన్ని చలానాలు రోజుల తరబడి అప్‌డేట్ కావడం లేదు. దీంతో సబ్ రిజిస్ట్రార్లు విక్రయదారులను వెనక్కి పంపుతుండడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఆటంకం నెలకొంటోంది. సాధారణంగా బ్యాంకులు, ఆన్‌లైన్ ద్వారా చలనాలు తీస్తే పది నిమిషాల తరువాత నుంచి అప్‌డేట్ అవుతాయి. అయితే కొన్ని చలానాలు రోజుల తరబడి ఉన్నా అప్‌డేట్ కాకపోవడంతో సబ్ రిజిస్ట్రార్లు ప్రక్రియను నిలిపివేస్తున్నారు. లేదంటే మళ్లీ కొత్త చలానా తీసుకోవాల్సి వస్తోంది. అలా చేసినప్పుడు పాత చలానా మొత్తాన్ని వెనక్కి తీసుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పది రోజులుగా ఈ సమస్య అధికమవడంతో చాలా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ వాయిదా వేసుకోవాల్సి వస్తోంది. ఈ సమస్యపై బ్యాంకు అధికారులను ప్రశ్నిస్తే తాము తీసిన చలానాకు డబ్బులు జమ చేశామని, తరువాత దానికి సంబంధించి విషయాలపై తాము ఏ మాత్రం జవాబుదారీ కాదని చెబుతున్నారు. చలానా అప్‌డేట్ అయితేనే తాము రిజిస్ట్రేషన్ చేస్తామని రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ల కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. ఇది కేవలం సాంకేతిక సమస్యగా ఉండే అవకాశం ఉందని, దానిని ఉన్నతాధికారులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఇస్రోలో మనోడు

- శాస్త్రవేత్తగా బేతంచెర్ల వాసి



ఇస్రోలో శాస్త్రవేత్తగా డాక్టర్ సలీం బాషా

బేతంచెర్ల: చంద్రయాన్ –3 విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తల ప్రతిభను అందరూ అభినందిస్తున్నారు. అలాంటి శాస్త్రవేత్తల్లో కూడా మన జిల్లాకు చెందిన వారు ఉండటం విశేషం. బేతంచెర్ల పట్టణానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ముల్ల మీరం సాహెబ్, వాహిదా దంపతుల పెద్ద కుమారుడు డాక్టర్ సలీం బాషా ప్రస్తుతం ఇస్రోలో శాస్త్రవేత్తగా సేవలు అందిస్తున్నారు. ఈయన 5వ తరగతి వరకు పట్టణంలోని సర్వస్వతి విద్యామందిర్, ఆ తర్వాత శేషారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేశాడు. అనంతపురం జేఎన్టీయూ పాలిటెక్నిక్, జేఎన్టీయూ హైదరాబాద్ విశ్వ విద్యాలయంలో బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. 2006లో ఇస్రోలో జాయిన్ అయ్యి ఉద్యోగం చేస్తూ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరులో పీహెచ్‌డీ డాక్టరేట్ 2021 పొందారు. ప్రస్తుతం లీడ్ సైంటిస్టుగా ఇస్రోలో కొనసాగుతున్నారు. ఎన్నో ఇస్రో మిషన్స్‌లో పాత్ర పోషించిన సలీం బాషా చంద్రయాన్ –2, చంద్రయాన్–3లో థర్మల్ డిజైనింగ్ లీడ్ సైంటిస్టుగా పాత్ర పోషించారు. దేశం కోసం కొత్త ఆవిష్కరణలు సృష్టిస్తున్న శాస్త్రవేత్తల్లో బేతంచెర్ల వాసి ఉండటంతో అతని కుటుంబ సభ్యులు మహబూబ్ బాషా, ఉసేన్ బాషా, రూహిద్ అక్రం, వాసిమ్ అక్రమ్‌తో పాటు పట్టణ ప్రజలు, పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆరుగురు కూలీలకు అస్వస్థత

- మొక్కజొన్నకు థిమెట్ గుళికలు వేస్తుండగా ఘటన
- జైన్ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల మండిపాటు



అస్వస్థతకు గురైన వ్యవసాయ కూలీలకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

జూపాడుబంగ్లా: జైన్ కంపెనీలో మొక్కజొన్న పంటకు థిమెట్ గుళికలు వేస్తున్న ఆరుగురు కూలీలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. జైన్ కంపెనీలో రోజువారి వ్యవసాయ పనుల నిమిత్తం జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన 14 మంది ఉదయం కూలీకి వెళ్లారు. కంపెనీ అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో చేతులతోనే అత్యంత విషపూరితమైన థిమెట్ గుళికలను మొక్కజొన్న పంట సుడుల్లో వేయించాల్సి వచ్చింది. దీంతో గుళికల విషప్రభావంతో వ్యవసాయ కూలీలు వెంకటేశ్వరమ్మ, సుమలత, చంద్రకళ, విజయలక్ష్మి, మెహరున్నిసా, శ్యామల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించటంతో డాక్టర్ సభా వారికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జైన్ కంపెనీ అధికారుల నిర్లక్ష్యంతోనే కూలీలు అస్వస్థతకు గురయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కూలీలు ఆసుపత్రిలో ఉన్నా కంపెనీ అధికారులు ఎవరూ రాకపోవడంతో కూలీల కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ ఆరా..

జైన్ కంపెనీలో పనిచేసే కూలీలు అస్వస్థతకు గురయ్యారనే విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకొన్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వెంటనే రెవెన్యూ సిబ్బందికి ఫోన్ చేసి వివరాలు తెలసుకున్నారు. కూలీల ఆరోగ్య పరిస్థితి, సంఘటనకు గలకారణాలను తెలుసుకున్నారు.